నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# రంగారెడ్డి

బుధవారం 27 డిసెంబర్ 2023
WEDNESDAY, DECEMBER 27, 2023
RANGAREDDY
పేజీలు : 8
PAGES





మంచాల పోలీస్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ సుధీర్‌బాబు

## రేపటి నుంచే..

జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ

# ప్రజా పాలన

### తహసీల్దార్లు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో బృందాల ఏర్పాటు

- ప్రతి టీంలోనూ రెవెన్యూ, వ్యవసాయ, విద్య, వైద్య, విద్యుత్తు, పౌరసరఫరాల శాఖల అధికారులు
- పర్యవేక్షకులుగా నోడల్ అధికారుల నియామకం
- గ్రామాలు, పట్టణాల్లో సభలు నిర్వహించి దరఖాస్తుల స్వీకరణ
- ఆరు గ్యారెంటీల అర్హుల ఎంపికపై అనుమానాలు
- ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు
- తెల్లరేషన్ కార్డుంటేనే ఆరు గ్యారెంటీలకు అర్హులంటూ ప్రచారం

8

ఆరు గ్యారెంటీల పథకాల అమలుకుగాను రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. రేపటి నుంచి జనవరి 6 వరకు గ్రామాలు, పట్టణాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించనున్నారు. వంద కుటుంబాలకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేసి, స్వీకరించిన దరఖాస్తులను ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఎంఈవోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించగా, పర్యవేక్షకులుగా జిల్లాస్థాయి అధికారులను ప్రభుత్వం నియమించింది. ప్రతి టీంలోనూ రెవెన్యూ, వ్యవసాయ, విద్య, వైద్య, విద్యుత్తు, పౌరసరఫరాల శాఖల అధికారులు ఉంటారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం దశలవారీగా ఆరు గ్యారెంటీల అమలుకు అర్హులను ఎంపిక చేయనున్నారు. అయితే ఆరు గ్యారెంటీల అర్హుల ఎంపికపై ప్రజల్లో పలు అనుమానాలు నెలకొన్నాయి. ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలను విడుదల చేయలేదు. తెల్లరేషన్ కార్డులేనివారు, రైతులు కూడా బ్యాంకు రుణాల కోసం ఐటీ చెల్లిస్తున్న దృష్ట్యా ఆరు గ్యారెంటీలు అందవేమోనని ఆందోళన చెందుతున్నారు.

– రంగారెడ్డి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ)





# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

- సైబర్ నేరగాళ్ల చేతిలో యువత మోసపోవద్దు
- డ్రగ్స్ సరఫరా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం
- ఫ్రెండ్లీ పోలీస్‌తో ప్రజలకు అండగా ఉంటాం
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- మంచాల మండలంలోని 15 గ్రామాల్లో 136 సీసీ కెమెరాలు ప్రారంభం

మంచాల, డిసెంబర్ 26 : డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, నేరగాళ్లను కఠినంగా శిక్షిస్తామని రాచకొండ పోలీస్ కమిషనర్ జీ సుధీర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం మంచాల మండలంలోని 15 గ్రామాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 136 సీసీ కెమెరాలను కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. యువత డ్రగ్స్ వ్యసనాలకు బానిస కాకూడదని, డ్రగ్స్ సరఫరా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎలాంటి సమాచారం ఉన్నా ప్రతిఒక్కరూ బాధ్యతతో పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎక్కువ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి, ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీ కెమెరాలతో కేసులు త్వరగా పరిష్కారమయ్యేందుకు అవకాశముందన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థతో ప్రజలకు అండగా ఉంటామని చెప్పారు. ముందుగా సీపీకి పోలీసులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ ఉమామహేశ్వర్ రావు, సీఐలు కాశీ విశ్వనాథ్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మంచు తెమ్మెరలు.. పూలతో గుసగుసలు..

బారెడు పొద్దెక్కినా..సూరీడు కనిపించక...కురుస్తున్న మంచుకు దారి కూడా కనిపించక ఒక పక్క వాహనదారులు ఇబ్బంది పడుతుంటే.. మరోపక్క ప్రకృతి కాంతలో ఎన్నెన్ని హొయలో.. అని ఓ సినీ కవి వర్ణించినట్టు.. పూలతోటపై మంచు తెమ్మెరలు దోబూచులాడుతూ ఆహ్లాదాన్ని పంచాయి. రంగారెడ్డి జిల్లా అంతప్పగూడలో ఇలా పూలతోటల ప్రకృతి సోయగాలను వాహనదారులు ఆస్వాదిస్తూ ఆనందిస్తున్నారు.

